

# పట్టణం దేవుడు

గోపాలం పోరుపడలేక చెప్పుల జతలేసుకుని బయలు దేరింది పారమ్మ. అవిడకు పట్టణం వచ్చినప్పటినుంచి యీనాటి వరకు బజారు బయలు దేరవలసిన అవసరం కలుగలేదు. అసలు గోపాలం ఇంటికి వచ్చిన రోజునే అడిగింది. ఆపట్టణంలో దేవాలయం ఏదైనా వుందా అని. గోపాలం కాళ్లరిగేటట్లు తిరిగాడు కానీ ఆ వూళ్లో దేవుడుగాని ఆయనకు సంబంధించిన ఆలయంగాని కనపించలేదు. చాలామంది స్థానికులను గూడా అడిగి చూచాడు గాని “గుడా.... అటువంటిది ఏం లేదే ఈ వూళ్లో” అన్నారు. అరిగిపోయిన చెప్పులకి మళ్లీ అడుగు వేయించుకుని బయలుదేరాడు గుడి ఎక్కడన్నా వుందేమోనని. పారమ్మ అదృష్టమో గోపాలం అదృష్టమో చిన్ననాటి స్నేహితుడొకడు కనిపించాడు దారిలో తిరిగి వస్తూంటే. తనకు కలిగిన ఆపదనంతా వెళ్లకక్కేశాడు గోపాలం. వచ్చిన స్నేహితుడు ఒక్కసారి విరగబడి నవ్వి ఈ వూళ్లో దేవాలయాలూ, గుళ్లూ వుండవురా ఖాయి... వుంటే గింటే దేవిడీలు వుంటాయి అన్నాడు. గోపాలం తన గ్రహణశక్తికి నిదర్శనం చూపిస్తున్నట్లు తెల్లమొఖం వేసి స్నేహితుని వంక చూశాడు. ఆ వూళ్లో దేవాలయాన్నే దేవిడీ అని పిలుస్తారని అట్లా అంటే కాని అక్కడ అర్థం కాదని సోదాహరణంగా నచ్చచెప్పి ఒక దేవిడీని గోపాలనికి చూపించి వెళ్లిపోయాడు స్నేహితుడు.

ఆ స్నేహితుడు చూపించిన గుడికే ఇప్పుడు పారమ్మ ప్రయాణం. పట్టణంలో చెప్పులు

లేందే నడవటం ఆరోగ్యకరం కాదని గోపాలం పారమ్మకు బాగా నచ్చ చెప్పాడు. గోపాలం మొన్నీ మధ్యనే ఆరోగ్యప్రదర్శన ఒకటి చూచి వచ్చాడు. దాని ఫలితం యిది. అయిష్టంగానే చెప్పులు వేసుకుని బయలుదేరింది పారమ్మ. తను పుట్టినప్పటినుంచి నేలమీద నడుస్తూనే వుంది కాని యిప్పుడు తన కాళ్లకి భూమికి మధ్యన ఒక అడ్డు ఏర్పడేటప్పటికి గాలిలో తేలి పోతున్నట్లుంది. ఎప్పుడూ చెప్పుల వంకనే చూస్తూ నడవడం వలన ఒకరిద్దరు మనుష్యులకు, ఒకటి రెండు కరెంటు స్థంభాలకు మెల్లగా ఢీకొంది. పక్కనే వస్తున్న గోపాలం చేయగలిగిన సహాయం ఏమీ కనపడటం లేదు. ఢీ కొన్న మనుష్యులకు సర్దిచెప్పటం తప్ప. ఈ బాధ పడలేక గోపాలం పెద్ద పనేదో వున్నట్టు ఒక్కసారిగా ఆగి అదిగో నమ్మమ్మా... పసుపు పచ్చగా కనపడటం లేదూ.... అదే గుడి. నువ్వు మెల్లిగా నడుస్తూవుండు... నే నిప్పుడే వస్తాను అన్నాడు. పచ్చని మేడ గాదురా... గుడి ఎక్కడా.... అంది ముసలమ్మ. అదే నమ్మమ్మా..... గుడి కట్టడానికి పర్మిషను దొరక్కపోతే.... మేడ కట్టి దాంట్లో దేవుడిని పెట్టారు అన్నాడు. పారమ్మకు నమ్మకం కుదరలేదు. అయినా గోపాలం తనతో రాకుండా ఆగిపోతున్నాడు గదా అని ఒక సంతృప్తి గలిగింది. గోపాలం పక్క కొట్టులోకి చొరబడగానే చెప్పుల జత చేతుల్లోకి తీసుకుని చక చక నడిచింది. ఇప్పుడే హాయిగా వుంది..... పాడు చెప్పులు ఎందుకు కొంటారో... అనుకుంది.

అనుమానం తోనే మేడగుడి దాకా పోయింది. లోపలకు తొంగిచూచేటప్పటికి భక్తాగ్రేసరులు, భక్త పరమాణువులు అప్పటికే సమావేశ మయ్యారు. హరికథ జోరుగా సాగుతోంది. గేటులోపలకు అడుగు పెడుతుండగానే పూజారి అడ్డుపడి చెప్పులు అక్కడ పెట్టి పొండమ్మా' అన్నాడు. 'అక్కర్లేదు నాయనా, నా దగ్గర పెట్టుకుంటాగా' అంది పారమ్మ. మర్యాదకోసం అడుగుతున్నాడేమో అనుకుంది. ఆఖరికి అక్కడ పెడితేనే గాని వీల్లేదని కూర్చున్నాడు పూజారి. చెప్పులు లోపలికి తీసుకుని వెళ్లకూడదట. అక్కడ హరికథ అయిపోతూంది. చివరికి విసుక్కుని అక్కడ తన జత వేరుగా ఉండాలనే ఉద్దేశంతో ఒక మూలగా పెట్టింది. ఆపని పూర్తికాగానే పూజారి చెయ్యిజాచి 'అర్ధణా' అన్నాడు. చెప్పుల్ని అక్కడ వుంచినందుకు అర్ధణా యివ్వాలిట. పారమ్మ దగ్గిర సరిగ్గా అర్ధణా వుంది. కొంగు ముడి విప్పి తీసి చూస్తే అది దేవుడికిద్దామని తెచ్చింది. దారిలో పూజారి ఎగరవేసుకు పోయేటట్టున్నాడు. చెప్పులు వద్దురా అంటె గోపాలం విన్నాడూ? బాగా ఆలోచించి పూజారి చేతిలో అర్ధణా పడేసింది, 'రామచంద్రా ఈ అర్ధణా నీకోసం తెచ్చిందే' నంటూ. ఆ గుడిలో వున్నది వెంకటేశ్వరస్వామి అని పారమ్మకు తెలియదు.

హరిదాసు ద్రౌపదీ స్వయంవరం గురించి చెపుతున్నాడు. మత్స్యయంత్రంలో గిరగిరా తిరిగే చేపని ఏ విధంగా ఛేదించారో వర్ణిస్తున్నాడు. పారమ్మకు చేప బదులు పైన చెప్పులు తిరుగుతున్నట్లు అనిపించింది. కర్ణుడు బాణం గురిపెట్టి కొడుతున్నాడు. చెప్పు చిల్లు పడుతుందేమోనని భయపడింది. కొంచెం మనస్సు స్థిరం చేసుకొంది. తను చెప్పులు పెట్టిన వైపు చూచింది. చెప్పులు కుప్పగా పెరిగిపోతున్నాయి. తన చెప్పులు అడుగున వున్నాయో లేదో? ఒకసారి చూసి వద్దామనుకుంది. యిక్కడ చూస్తే కర్ణుడు బాణం ప్రయోగిస్తున్నాడు. ఆ బాణం నిజంగా చేపకు తగిలితే. ద్రౌపదినిచ్చి కర్ణుడికి పెళ్లి చెయ్యెద్దూ? తగలకుండా వుండాలని దేవుడికి మొక్కుకొంది. భక్తురాలి వేదన హరిదాసు గ్రహించినట్లున్నాడు. బాణం చేపకు తగలకుండా తప్పించాడు. వెంట్రుక వాసిలో దూసుకుపోయిందన్నాడు. 'అమ్మయ్య' అనుకుంది. పారమ్మ

పక్కనున్న పెద్దమ్మ ఈమె వంకజూచి ఏదో మాట్లాడబోతున్నట్లు పెదిమలు కదిపి మళ్ళీ వూరుకుంది, నవ్వుతున్నట్లు ముఖం పెట్టి పారమ్మ సానుభూతిగా నవ్వింది. పారమ్మ చెప్పుల గురించిన ధ్యానంలో వుంది. అంత కుప్పలోనుంచి తన చెప్పులు ఏ విధంగా ఏరుకోవడమో అర్థం కావడం లేదు. హరికథ చాలా తొందరగా సాగిపోతోంది. స్వయంవరం అయిపోయింది. మిగతా కథ మర్నాడు చెపుతానన్నాడు. మృదంగం వాడు అప్పుడే కునుకునుంచి లేచి 'కథ అయిందా దాసూ?' అన్నాడు.

పారమ్మ ఇవన్నీ వినిపించుకోకుండా చకచకా చెప్పుల కుప్ప వైపుకి వచ్చింది. అన్నీ కలయచూచినా తన జత కనపడలేదు. పూజారిని కనుక్కుందామంటే అతను గూడా కనపడలేదు. ఏనాడూ చెప్పుల ముఖం తెలియని పారమ్మ అన్నం తినే చేత్తో అందరి చెప్పుల పరిశీలన ప్రారంభించింది. ఎక్కడా చిక్కలేదు. దొంగతనం చేసే వాళ్ల మీద పారమ్మకు అసహ్యం ఎక్కువ. 'దొంగతనం చెయ్యకపోతే చావకూడదూ' అని ఆమె అభిప్రాయం. ఇంటికి పోగానే 'చెప్పులేవీ' అంటూ గోపాలం అడుగుతే ఏమని చెప్పాలి? అసలు వద్దంటే విన్నాడూ? యిప్పుడు ఏం అనుకుంటే యేం లాభం? తన కాళ్లకు సరిపోయే జత వకటి కాళ్లకు తొడుక్కొని, ఛీ దొంగ వెధవలు... చెప్పులు గూడా ఎత్తుక పోవటమే.... మరీ కలికాలంగా వుంది..... రామచంద్రా' అంటూ ముక్కుమీద వేలేసుకుంది. బయటకు రాగానే. పోయిన చెప్పుల కంటే వచ్చిన చెప్పులు కొత్తవి అవటం వలన గోపాలం గోల పెట్టలేదు. పారమ్మ అదే కోరుకుంది.